క్లుప్తంగా

గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుదాం



గ్రామ సభలో సర్పంచ్ తదితరులు

సోంపేట: గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకుందామని జింకిభద్ర పంచాయతీ సర్పంచ్ తామాడ పద్మావతి అన్నారు. ఆదివారం నిర్వహించిన గ్రామసభలో ఆమె మాట్లాడారు. గ్రామ పొలిమేర్లలో బహిరంగ మలమూత్ర విసర్జన లేకుండా సహకరించాలని, మురుగు నీరు రోడ్లపైకి వదలవద్దని, సంపూర్ణ మద్యనిషేధం అమలు చేయాలని అందరి సహకారంతో తీర్మానం చేశారు. అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. సభలో సచివాలయ సిబ్బంది, ఉపసర్పంచ్ సాహుకారి జాని, ఎంపీటీసీ మాజీ సభ్యుడు జె.పురుషోత్తం పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత



చిన్నారులకు వీల్‌చైర్లు, నిత్యావసర సరకులు అందజేస్తున్న దృశ్యం

కంచిలి: మండలంలోని మండపల్లి గ్రామానికి చెందిన సీతయ్య ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు సోంపేట పట్టణ శివారు అంబేడ్కర్ కాలనీకి చెందిన ఇద్దరు దివ్యాంగ చిన్నారులకు వీల్‌చైర్లు, వారి కుటుంబాలకు నిత్యావసర సరుకులను సమకూర్చారు. వీటిని శనివారం సాయంత్రం అందజేశారు. సంస్థ నిర్వాహకులు గుళ్ల రమేష్, మోహన్ పాల్గొన్నారు.

జీడిని ఆశించిన తెగుళ్లు



జీడి పంటను ఆశించిన బూజు తెగులు

వజ్రపుకొత్తూరు రూరల్: ఉద్దాన ప్రాంత ప్రజల జీవనాధారమైన జీడి పంట ప్రస్తుతం పూత, పిందె దశలో ఉంది. అయితే వాతావరణ పరిస్థితుల ప్రభావంతో పంటకు బూజు తెగుళ్లు ఆశించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత సీజన్‌లో ఉద్యాన శాఖాధికారులు సలహాలు, సూచనలు అందించడం లేదని రైతులు చెబుతున్నారు. చినవంక, డోకులపాడు, చీపురపల్లి, కొండపల్లి, అక్కుపల్లి, బైపల్లి, చినకొత్తూరు, గరుడబద్ర తదితర గ్రామాల్లోని జీడి పంటను తెగుళ్లు ఆశించడంతో పూత, పిందె ఎండిపోతుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు సకాలంలో అందించాలని కోరుతున్నారు.

ఉపాధి పనుల పరిశీలన



వేతనదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

వజ్రపుకొత్తూరు రూరల్: ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులతో గ్లోబల్ వార్మింగ్ ప్రభావంతో వేడెక్కుతున్న ఉపరితల వాతావరణాన్ని పరిరక్షించవచ్చని వెలుగు ఏపీఎం గొడబ ప్రసాదరావు అన్నారు. డోకులపాడులో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం పరిశీలించారు. అనంతరం కంపోస్టు, సోక్ పిట్లపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలని వేతనదారులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యాదవరాజు, సచివాలయ సిబ్బంది ధనుంజయ్, హేమలత, నాగేశ్వరరావు ఉన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



నిర్లక్ష్యంగా ప్రయాణిస్తున్న చిన్నారులు

కాశీబుగ్గ: కాశీబుగ్గ–పలాస మున్సిపాలిటీ పరిధిలో పాఠశాలలకు వెళ్తున్న పిల్లలు ప్రమాదకర ప్రయాణాన్ని చేస్తున్నారు. ప్రధానంగా ప్రైవేటు పాఠశాలలకు ఆటోల్లో వెళ్తున్న పిల్లలు కనీస జాగ్రత్తలు తీసుకోవడం లేదు. పరిమితికి మించి విద్యార్థులతో ఆటోలు వెళ్తున్నాయి. పిల్లలు కూడా వెనుకసీట్లలో కనీసం పట్టుకోకుండా ప్రయాణం చేస్తున్నారు. సంబంధిత అధికారులు ప్రమాదకర ప్రయాణాలపై దృష్టి సారించి అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఇసుకాసురుల బరితెగింపు!

- బాహుదా నదిలో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు
- ఆంక్షలున్నా ఆగని రవాణా
- కూటమి నాయకుల అండతో రెచ్చిపోతున్న వైనం



రైల్వే ట్రాక్‌కు సమీపంలో బాహుదా నదిలో తరలింపునకు సిద్ధంగా ఉన్న ఇసుక పోగులు

బాహుదా నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్

ఇచ్ఛాపురం: ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. ఆంక్షలున్నా పట్టించుకోకుండా ఇసుకను యథేచ్ఛగా తవ్వేసి.. వాహనాల్లో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కూటమి నాయకుల అండతో సాగుతున్న ఇసుక దోపిడీకి బాహుదానది అడ్డాగా మారింది. ఇచ్ఛాపురం మండలంలోని బాహుదా నదిలో ఇసుక తవ్వకాలను అధికారులు నిషేధించారు. ఎవరైనా దీన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ బోర్డులను సైతం ఏర్పాటు చేశారు. కానీ వీటిని ఎవరూ పట్టించుకోవడం లేదు సరికదా రైల్వేట్రాక్, బ్రిడ్జిల సమీపంలో కూడా ఇసుకను తవ్వేస్తున్నారు. దీంతో వంతెనలకు, ట్రాక్‌కు ప్రమాదం పొంచిఉందనే ఆందోళనను స్థానికుల వ్యక్తం చేస్తున్నారు. పాత బ్రిడ్జి, పాతాళసిద్ధేశ్వరాలయం సమీపంలో నదిలో ఇసుకను తవ్వేయడంతో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. వేసవి కావడంతో నదిలో నీటి ప్రవాహం తగ్గింది. దీన్ని అదునుగా చేసుకున్న కొందమంది నాయకుల సహకారంతో ఇసుకను తవ్వించేసి పోగులుగా వేస్తున్నారు. రాత్రి సమయంలో, తెల్లవారుజామున ట్రాక్టర్ల ద్వారా ఇసుకను రహస్య ప్రాంతాలకు తరలించి డంపింగ్ చేస్తున్నారు. అనంతరం కావాల్సిన వారికి ఇసుకను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నదిలో ఇసుకను యథేచ్ఛగా తవ్వేస్తుండడంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ఫలితంగా నదిలో ఉన్న ఇన్‌ఫిల్టర్ బావులకు కావాల్సినంత నీరు చేరడం లేదు. దీంతో ఇచ్ఛాపురం మున్సిపల్ ప్రజలకు సక్రమంగా మంచినీటి సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి ఇసుక అక్రమ తవ్వకాలను నిషేధించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



బెల్లుపడ మెయిన్ రోడ్డులో విద్యుత్ సబ్‌స్టేషన్ వెనుక నిల్వ చేసిన ఇసుక



ఇసుక తవ్వకాలు చేయరాదని అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు(ఫైల్)

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు



ఎవరైన అక్రమంగా ఇసుకను రవాణా చేస్తే ఆటువంటి వాహనాలు సీజ్ చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటాం. బాహుదానదిలో ఇసుక తవ్వకాలు అరికట్టేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమిస్తాం. ఇసుక తవ్వకాలను ఉపేక్షించం.

–ఎన్.వెంకటరావు, తహసీల్దార్, ఇచ్ఛాపురం

పది పరీక్షలకు సర్వం సిద్ధం

- టెక్కలి డివిజన్‌లో 34 కేంద్రాలు ఏర్పాటు
- పరీక్షకు హాజరుకానున్న 6,251 మంది విద్యార్థులు



కంచిలిలోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్ పాఠశాల కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈవోలు

టెక్కలి:

పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న పరీక్షల సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని టెక్కలి డివిజన్ పరిధిలోని విద్యాశాఖాధికారులు వెల్లడించారు. డివిజన్ పరిధిలో 34 కేంద్రాలను కేటాయించామని.. మొత్తం 6,251 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉందన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష జరగాల్సి ఉండగా.. కేటాయించిన కేంద్రాలకు కనీసం గంట ముందుగా విద్యార్థులు చేయాలని సూచించారు. టెక్కలి మండలంలో ఆరు కేంద్రాలకు 968 మంది విద్యార్థులను కేటాయించారు. కోటబొమ్మాళి మండలంలో ఐదు కేంద్రాలకు 854 మంది, సంతబొమ్మాళిలో నాలుగు కేంద్రాలకు 700 మంది, నందిగాం మండలంలో మూడు కేంద్రాలకు 320 మంది విద్యార్థులను కేటాయించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు నిర్వహించనున్నారు.

కంచిలి మండలంలో నాలుగు కేంద్రాలు..

కంచిలి: కంచిలి మండలంలో పదో తరగతి పరీక్షలను నాలుగు కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు ఎంఈవోలు ఎస్.శివరాంప్రసాద్, కె.చిట్టిబాబు తెలిపారు. మండల కేంద్రం కంచిలిలో ఏపీఎస్‌డబ్ల్యూఆర్ పాఠశాల, కళాశాల ప్రాంగణం, జె.ఎం.జె. ఇంగ్లిష్ మీడియం పాఠశాల, మఠం సరియాపల్లిలో ఏపీ మోడల్ స్కూల్, జెడ్పీ ఉన్నత పాఠశాల కేంద్రాల్లో 709 మంది పరీక్షలు రాయాల్సి ఉందన్నారు. ఇందుకు తగిన ఏర్పాట్లు పూర్తచేసినట్టు తెలిపారు. పరీక్ష కేంద్రాలను ఎంఈవోలు ఆదివారం పరిశీలించారు.

వేడుకగా భద్రకాళీ సంబరం



అమ్మవారి ప్రతిరూపాలను ఊరేగిస్తున్న దృశ్యం

సోంపేట: మండలంలోని పలాసపురం గ్రామంలో భద్రకాళీమాత సంబరాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కాళీవేషధారణ, మేళతాళాలతో అమ్మవారిని ఊరేగించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పలాసలో సీఐఎస్ఎఫ్ సిబ్బంది సైకిల్ ర్యాలీ



సైకిల్ ర్యాలీలో సీఐఎస్ఎఫ్ జవాన్లు

కాశీబుగ్గ: తీరప్రాంత రక్షణ కోసం ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సీఐఎస్ఎఫ్ జవాన్లు చేపట్టిన సైకిల్ ర్యాలీ ఆదివారం కాశీబుగ్గ–పలాస మున్సిపాలిటీకి చేరింది. పలాస మండలం రామక్రిష్ణాపురంలోని సత్యసాయి విద్యావిహార్‌లో అల్పాహారం తీసుకున్న సీఐఎస్ఎఫ్ జవాన్లు అక్కడి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం మొగిలిపాడు యూత్, మాజీ సైనికులు వెంట రాగా.. సైకిల్ ర్యాలీ ఇక్కడ నుంచి బయలుదేరి శ్రీకాకుళం వైపు సాగింది.

పాఠశాలకు మంచినీటి సదుపాయం

వజ్రపుకొత్తూరు రూరల్:

అక్కుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన.. ఏపీ ట్రాన్స్‌కో డీఈఈ జోగి కృష్ణమూర్తి, లైన్‌మెన్ ఢిల్లీరాజు సమకూర్చిన రూ.70 వేలతో ఏర్పాటు చేసిన మంచినీటి కుళాయి, ట్యాంక్‌లను స్థానిక శ్రీరామ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి దాతల సాహకారం అభినందనీయమన్నారు. గ్రామాభివృద్ధికి తమవంతు సహకరిస్తామని దాతలు ప్రకటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు దాతలను ఘనంగా సన్మానించారు. అలాగే పాఠశాలలో మరుగుదొడ్డి నిర్మాణానికి ఆర్థిక సాయం అందించిన కాస యువరాజు, కాస తులసీదాస్, ఎం.మోహన్‌రావులను అభినందించారు. స్థానిక నాయకుడు లండ రామలింగం, శ్రీరామ సేవా సంఘం అధ్యక్షుడు మోస వరప్రసాదరావు, సూరాడ మోహన్‌రావు, పాఠశాల కమిటీ చైర్మన్ కె.ఇందిరా ప్రియదర్శిని, గ్రామ పెద్దలు సింగుపల్లి బాలక్రిష్ణ, బర్రి భూపతి, కాస ముకుంద, కాస సోమశేఖర్, కె.ఎల్.నాయుడు, హెచ్‌ఎం డి.జనార్దన ఉన్నారు.

అమరజీవికి ఘన నివాళులు



కవిటి: కొత్తపుట్టుగలో అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపీపీ కడియాల పద్మ



కవిటి: పెద్ద ఎర్రగోవిందపుట్టుగలో శ్రీరాములు జయంతి కార్యక్రమంలో చిన్నారులు



పలాస: మండల పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీవో కె.వసంతకుమార్, సిబ్బంది



కంచిలి: శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీవో వి.తిరుమలరావు, ఉద్యోగులు



సోంపేట: శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సోంపేట జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.మోహనరావు, అధ్యాపక సిబ్బంది



నందిగాం: పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్



కాశీబుగ్గ: మున్సిపల్ కార్యాలయంలో అమరజీవి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమిషనర్ ఎన్.రామారావు తదితరులు



వజ్రపుకొత్తూరు రూరల్: బిలాయిలో శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రవాసాంధ్రులు

ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు ఆదర్శప్రాయుడని వక్తలు కొనియాడారు. ఆయనను ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. శ్రీరాములు జయంతి కార్యక్రమాన్ని పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాల్లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి.. సేవలను కొనియాడారు.

–సాక్షి నెట్‌వర్క్

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



కవిటి మండలం గొండ్యాలపుట్టుగ గ్రామంలోని భూలోకమాత ఆలయ 15వ వార్షికోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈదుపురం గ్రామానికి చెందిన పురోహితుడు చంద్రశేఖర శథపతి ఆధ్వర్యంలో మహిళలచే సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం లోకకల్యాణార్థం శాంతి హోమం చేశారు. వేడుకల్లో భాగంగా ఏకాహం భజన కాలక్షేపం అలరించింది. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు.

–కవిటి

విద్యార్థులకు అండగా..



సంతబొమ్మాళి మండలం నౌపడ గ్రామానికి చెందిన అనాథ విద్యార్థులు కొంచాడ స్వాతి, పల్లవికి బిగ్‌హెల్ప్ స్వచ్ఛంద సంస్థ అండగా నిలిచింది. తల్లిదండ్రులను కోల్పోయిన వీరికి బిగ్‌హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ చైర్మన్, ఫౌండర్ షేక్ చాంద్‌పాషా, యూఎస్ఏలో ఉంటున్న అనిత, సతీష్ సహకారంతో 25 వేల రూపాయల విలువైన చదువు కోసం పుస్తకాలు, నిత్యావసర సరుకులను ప్రాజెక్టు చైర్మన్ సీవీ రాజా మాస్టర్, జోనల్ డైరెక్టర్ ఎల్.జయకృష్ణారెడ్డి చేతుల మీదుగా ఆదివారం అందజేశారు.

–సంతబొమ్మాళి

గాయకుడికి సత్కారం..



ప్రముఖ రచయిత బమ్మిడి సుబ్బారావు రాసిన భక్తి గేయాలు జనరంజకంగా ఉన్నాయని కాశీబుగ్గకు చెందిన జనజాగృతి సంస్థ వ్యవస్థాపకులు తెప్పల కృష్ణమూర్తి చెప్పారు. రిట్టపాడులోని వెంకటేశ్వరస్వామి ప్రాంగణంలో ఎస్.వి.మ్యూజికల్ ఆడియో ఫంక్షన్ ఆధ్వర్యంలో ఈ పాటలను ఆదివారం విడుదల చేశారు. సుబ్బారావు 12 భక్తి పాటలను రాయగా అదే గ్రామానికి చెందిన బాలక చిట్టిబాబు గానం చేశారు. ఈ సందర్భంగా చిట్టిబాబు, బమ్మిడి సుబ్బారావులను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పిన్నింటి రామారావు, డి.ఆర్.ఎం చౌదరి, సీపాన తిరుపతి, పొందల జగదీష్, పొందల నిరంజన్, కళాకారులు, భజన బృందం సభ్యులు పాల్గొన్నారు.

–పలాస

అధికారాల్లేని సమావేశం ఎందుకు?

- కూటమి ప్రభుత్వ ధోరణికి నిరసనగా సభ్యుల వాకౌట్
- మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాలతో మండల పరిషత్ నిధులు అడ్డుకుంటున్నారని ఆవేదన



అచ్చెన్నాయుడు వైఖరికి నిరసనగా సభ నుంచి వాకౌట్ చేస్తున్న సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీరామమూర్తి

నందిగాం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక సంస్థల అధికారాలను నిర్వీర్యం చేస్తూ ప్రజా ప్రతినిధులను అవమానపరుస్తున్నారని సభ్యులు వాపోయారు. ఈ నేపథ్యంలో అధికారాలు లేని సమావేశం నిర్వహణ అవసరం లేదని నందిగాం మండల పరిషత్ సభ్యులు సర్వసభ్య సమావేశం నుంచి వాకౌట్ చేశారు. ఎంపీడీవో రాజారావు ఆధ్వర్యంలో ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. సభ ప్రారంభంలో ఎంపీడీవో మండలంలో చేపట్టిన వివిధ పనుల వివరాలు తెలియజేస్తుండగా.. కర్లపూడి, కాపుతెంబూరు సర్పంచ్‌లు తమిరె రాజు, పోలాకి మోహనరావు, పెద్దలవునిపల్లి ఎంపీటీసీ సభ్యురాలు పూడి ఆశారాణి తదితరులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామాల్లో అభివృద్ధి జరగాలనే ఉద్దేశంతో వివిధ పనులు చేపట్టేందుకు పంచాయతీ తీర్మానాలు చేశామని.. కానీ కూటమి ప్రభుత్వంలో మంజూరైన పనుల వివరాలు, పనులు ప్రారంభించేటప్పుడు కనీస సమాచారం కూడా అధికారులు తమకు ఇవ్వకుండా అగౌరవ పరుస్తున్నారని వాపోయారు. దేవుపురం ఎంపీటీసీ సభ్యుడు యర్ర చక్రవర్తి మాట్లాడుతూ.. మండల పరిషత్ ద్వారా గుర్తించిన పనుల కోసం తీర్మానం చేసినా వాటిని ఇంత వరకు మంజూరు చేయలేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎంపీపీ శ్రీరామమూర్తి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోని వచ్చిన తర్వాత స్థానిక సంస్థలను, వాటి అధికారాలను నిర్వీర్యం చేస్తూ ప్రజా ప్రతినిధులను అవమాన పరుస్తున్నారన్నారు. జిల్లాకు చెందిన మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాలతో మండల పరిషత్ నిధులు ఖర్చు చేయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. మండల పరిషత్ ద్వారా తీర్మానించిన పనులను ఎంపీడీవో, ఇంజినీరింగ్ అధికారులు పరిపాలనా అనుమతులు, ఎం.బుక్ నమోదు చేయడం లేదన్నారు. అభివృద్ధి చేస్తామని చెప్పుకునే మంత్రి అచ్చెన్నాయుడు వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు ఉన్న పంచాయతీల్లో పనులు జరగకుండా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు పేరాడ భార్గవి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ ధోరణికి, మంత్రి అచ్చెన్నాయుడు పక్షపాత వైఖరికి నిరసనగా ఎటువంటి అధికారులు లేని సమావేశాలు నిర్వహించడం అవసరం లేదంటూ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. అనంతరం సమావేశం నుంచి వాకౌట్ చేశారు. వైస్ ఎంపీపీ సువ్వారి వసంత్, మండల ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

వజ్రపుకొత్తూరు: పశువుల్లో గాలికుంటు వ్యాధి సోకే అవకాశం ఉన్నందు ప్రతీ పాడి రైతు అప్రమత్తంగా ఉండి నివారణ టీకాలు పశువులకు వేయాలని పశుసంవర్ధక శాఖ డీడీ డాక్టర్ వి.జయరాజ్ అన్నారు. దేవునల్తాడ పంచాయతీ డి–చీపురుపల్లిలో పశువులకు గాలింటు వ్యాధి నివారణ టీకాలను వేసే కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు.